క్లుప్తంగా

సీఎం, డిప్యూటీ సీఎంను కలిసిన ఎమ్మెల్యే సామేల్



సీఎం, డిప్యూటీ సీఎంలతో ఎమ్మెల్యే సామేల్

తిరుమలగిరి : మండల కేంద్రంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేసినందుకుగాను హైదరాబాద్‌లోని సీఎం క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే మందుల సామేల్ సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్కలను బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం శాలువాలతో ఘనంగా సన్మానించారు.

రాష్ట్ర కమిటీకి ఎన్నిక



దండుగుల యల్లయ్య చిప్పలపల్లి ధర్మయ్య

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలంలోని పలువురు ఉపాధ్యాయులు పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర కమిటీకి ఎన్నికయ్యారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా దండుగుల యల్లయ్య, చిప్పలపల్లి ధర్మయ్య, జి.చంద్రారెడ్డి, గజ్జి శంకర్, కె.రమేష్, ఉప్పు మధుకర్, ఆర్.సైదులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎన్నికైన సభ్యులు రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి దామోదర్‌రెడ్డి, జితేందర్ రెడ్డి, నరేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. నూతనంగా ఎన్నికైన వారిని బుధవారం సంఘం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉల్లెందుల సైదులు, జలగం పురుషోత్తం అభినందించారు.

పీఆర్‌టీయూ రాష్ట్ర కమిటీకి ఎన్నిక

నూతనకల్ : మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన పీఆర్‌టీయూ టీఎస్ నాయకులు హైదరాబాద్‌లో నిర్వహించిన స్టేట్ కౌన్సిల్ సమావేశంలో రాష్ట్ర కమిటీకి బుధవారం ఎన్నికయ్యారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా శివయ్య, చవగాని వెంకయ్య, గుండగాని శ్రీనివాస్, గుణగంటి శ్రీనివాస్, రాష్ట్ర వైస్‌ప్రెసిడెంట్‌గా మన్నెం వెంకన్న, రాష్ట్ర కార్యదర్శిగా అనంతుల శ్రీశైలం ఎన్నికయ్యారు. వారి ఎన్నిక పట్ల సంఘం మండల నాయకులు అభినందనలు తెలిపారు.

బీజేపీ దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడిగా నరేష్



నెమ్మాది నరేష్

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని అనంతారం గ్రామానికి చెందిన నెమ్మాది నరేష్ బీజేపీ దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడిగా బుధవారం నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నట్లు తెలిపారు. జిల్లాలో బీజేపీ బలోపేతానికి తనవంతు కృషిచేస్తానని అన్నారు. తన ఎన్నికకు సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

నీటి స్వచ్ఛతపై జాగ్రత్తలు తీసుకోవాలి



మోటార్ మరమ్మతులపై అవగాహన కల్పిస్తున్న ట్రైనర్

పెన్‌పహాడ్ : గ్రామపంచాయతీల్లో ఇంటింటికీ సరఫరా చేసే మంచినీటిని ఎప్పటికప్పుడు పరీక్షించి నీటి స్వచ్ఛతపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ పాండు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామ మంచినీటి సహాయకులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మిషన్ భగీరథ నీటిని బోరు నీటితో కలిపితే నాణ్యత తగుతుందని వాటిని ప్రజలకు సరఫరా చేయరాదని సూచించారు. అనంతరం సింగిల్ ఫేజ్, త్రీ ఫేజ్ మోటార్ల మరమ్మతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, ఎంపీఓ సంజీవయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాస్, ట్రైనర్ నాగయ్య, గ్రిడ్ ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువులు అందజేత

నాగారం : మండల పరిధిలోని ఫణిగిరిలో బుధవారం గ్రామపంచాయతీ కార్మికులకు ఎంపీఓ కె.మారయ్య నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కార్యదర్శి అరుణ్, జీపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాటల సీడీ ఆవిష్కరణ

అర్వపల్లి : మండలంలోని కొమ్మాల గ్రామానికి చెందిన సినీ సంగీత కళాకారుడు కుదురుపాక వేణు కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది దరూరి యోగానందచారిపై పాటల సీడీని రూపొందించారు. ఈ సీడీని బుధవారం జాజిరెడ్డిగూడెంలో యోగానంద చారి చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, శిగ నసీర్‌గౌడ్, బింగి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

అధ్వాన రహదారితో అవస్థలు

- అడుగడుగునా గుంతలతో ప్రయాణికుల ఇక్కట్లు
- నిధులు మంజూరైనా ప్రారంభంకాని మరమ్మతు పనులు

తుంగతుర్తి : వివిధ గ్రామాలకు వెళ్లే లింక్‌రోడ్లు గుంతలమయంగా మారి అధ్వానంగా మారాయి. దీంతో ఆయా గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు ప్రయాణాలు సాగించాలంటే అవస్థలు పడుతున్నారు. మండలంలో తుంగతుర్తి నుంచి వెంపటి, రావులపల్లికి వెళ్లే రహదారి గుంతలమయంగా మారింది. అడుగడుగునా గుంతలు ఉండటంతో రాకపోకలు సాగించడానికి ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తుంగతుర్తి నుంచి వెంపటికి మూడు కిలోమీటర్ల దూరంలో రోడ్డు పూర్తిగా దెబ్బంది. అలాగే వెంపటి నుంచి రావులపల్లికి మధ్య 5కిలోమీటర్ల దూరం రోడ్డు పూర్తిగా ధ్వంసమై రోడ్డుపై పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. తుంగతుర్తి, వెంపటి, రావులపల్లి మీదుగా తొర్రూరు, వరంగల్‌కు ప్రజలు అధికంగా వెళ్తుంటారు. అలాగే మానాపురం, ఏనెకుంటతండా, రావులపల్లి, వెంపటి, తుంగతుర్తి మీదుగా నిత్యం సూర్యాపేట- హైదరాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్తుంటారు. తుంగతుర్తి నుంచి రావులపల్లికి 8కిలోమీటర్ల దూరం వెళ్లడానికి 20నిమిషాల సమయం పడుతుంది. కానీ రోడ్డు గుంతలమయంగా మారడంతో ప్రయాణికులకు సుమారు గంట సమయం పడుతుంది.



వెంపటి సమీపంలో రోడ్డుపై ఏర్పడిన గుంతలు

వర్షం వస్తే గుంతలలో నీరు చేసి పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రహదారిపై అడుగడుగునా గుంతలు ఉండటంతో ద్విచక్ర వాహనదారులు తరుచూ ప్రమాదాల భారీ పడుతున్నారు.

పట్టించుకోని పాలకులు, అధికారులు..

మూడేళ్లుగా తుంగతుర్తి-రావులపల్లి రహదారి గుంతలమయంగా ఉండి ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నా ఇటు పాలకులు గానీ, అర్అండ్‌బీ అధికారులు కానీ పట్టించుకోకపోవడం విచారకరం. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి తుంగతుర్తి నుంచి రావులపల్లి వరకు రోడ్డు మరమ్మతులు చేయించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

నిధులు మంజూరైనా ప్రారంభం కానీ పనులు...

తుంగతుర్తి నుంచి మానాపురం వరకు 8కి.మీ మేర డబుల్‌రోడ్డు నిర్మాణానికి రూ.16.80 కోట్ల నిధులు, రావులపల్లి ఎక్స్‌రోడ్డు నుంచి ఏనెకుంటతండా వరకు 6.3కి.మీ బీటీ రెన్యూవల్‌కు రూ.1.10కోట్ల నిధులు గత ఏడాది డిసెంబర్‌లో మంజూరయ్యాయి. కానీ ఏడాది గడుస్తున్నా నేటి వరకు ఈ పనులు ప్రారంభం కాలేదు.



వెంపటికి వెళ్లే రహదారి

రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి



తుంగతుర్తి నుంచి వెంపటి మీదుగా రావులపల్లి వరకు రోడ్డు పూర్తిగా దెబ్బతిని రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. మూడేళ్లుగా రోడ్డు దెబ్బతిని గుంతలమయంగా మారింది. అయినా ఇప్పటికీ రోడ్డు పనులు చేపట్టకపోవడంతో ప్రజలు, ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలి.

– మారెల్లి వెంకన్న, వెంపటి

ఎస్సీ వర్గీకరణపై మాటతప్పిన సీఎం రేవంత్‌రెడ్డి

భానుపురి (సూర్యాపేట) : ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి మాట తప్పారని ఎమ్మార్పీఎస్, మహాజన సోషలిస్టు పార్టీ ఉమ్మడి నల్లగొండ జిల్లా నాయకుడు కందుకూరి సోమన్న అన్నారు. బుధవారం సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ బీఎస్ లతకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును ముందుగానే తెలంగాణలో అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారని, ప్రస్తుతం ఎలాంటి ఆర్డినెన్స్ లేకుండా నియామకాలు చేపడుతున్నారని, దీంతో మాదిగ, మాదిగ ఉపకులాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. రేవంత్‌రెడ్డి మాట తప్పారని, వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు యాతాకుల రాజన్న మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చింత వినయ్‌మాదిగ, నాయకులు గద్దం ఖాసిం, ఎర్ర వీరస్వామి, దయానంద్, కృష్ణ, రాము, బొజ్జ సైదులు, సావిత్ర, ఏపూరి రాజు, నాగేశ్వరి, ఆంజనేయులు, రవి, సంధ్య, శ్రీనివాస్, కోటేష్, నవీన్, వెంకన్న, లింగస్వామి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



అదనపు కలెక్టర్ బీఎస్ లతకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఐద్వా ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు



బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న ఐద్వా సభ్యులు

చివ్వెంల : మండల పరిధిలోని కుడకుడ గ్రామంలో బుధవారం ఐద్వా ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ఆడపిల్లను పుట్టనిద్దాం..పెరగనిద్దాం అనే నినాదంతో బతుకమ్మ ఆడిపాడారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దెల జ్యోతి మాట్లాడారు. చిన్నపిల్ల నుంచి వృద్ధురాళ్ల వరకు మహిళలపై అత్యాచారాలకు పాల్పడుతున్న మృగాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆడపిల్లల జోలికి వస్తే భయపడేలా శిక్షలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న చట్టాలను ప్రభుత్వం కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పిండిగా నాగమణి, కోట సృజన, కొప్పుల రజిత, ఆవుదొడ్డి భాగ్యమ్మ, ఎల్లగాని లక్ష్మి, యల్లమ్మ, కవిత తదితరులు పాల్గొన్నారు.

సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడాలి

భానుపురి (సూర్యాపేట) : చెగువేరా పోరాట స్ఫూర్తితో సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ అన్నారు. బుధవారం చెగువేరా వర్ధంతి సందర్భంగా పట్టణంలోని లెనిన్ నగర్‌లో పార్టీ, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. దేశంలో బీజేపీ రూపంలో ఫాసిజం విలయతాండవం చేస్తుందన్నారు. మైనార్టీలను, దళితులను, ప్రశ్నించే విప్లవకారులను ఈ దేశంలో లేకుండా చేస్తుందన్నారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ప్రజలకు ఎలాంటి న్యాయం జరగట్లేదని, పాలక ప్రభుత్వాలు స్వార్థం కోసం పేదలను మోసం చేస్తూ అవినీతి దోపిడీని పెంచిపోషిస్తున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు కారింగుల వెంకన్న, పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్‌కుమార్, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా కన్వీనర్ గొడ్డలి నర్సయ్య, నాయకులు పేర్ల నాగయ్య, గులాం హుస్సేన్, మోహన్, శంకర్, విజయ్‌రెడ్డి పాల్గొన్నారు.



చేగువేరా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

మద్యపాన నిషేధానికి సహకరించాలని వినతి



కలెక్టరేట్‌లో ఏఓకు వినతిపత్రం అందిస్తున్న గట్టికల్ గ్రామస్తులు

భానుపురి (సూర్యాపేట) : ఆత్మకూర్(ఎస్) మండలంలోని గట్టికల్ గ్రామంలో సంపూర్ణ మద్యపాన నిషేధం అమలుకు అధికారులు సహకరించాలని గ్రామ అఖిలపక్ష పార్టీల నాయకులు, గ్రామస్తులు కోరారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లో ఏఓ సుదర్శన్‌రెడ్డి, ఎక్సైజ్ సీఐకి వినతిపత్రం అందజేశారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడారు. గ్రామంలో మద్యం కారణంగా ఎందరో అనారోగ్యాల బారిన పడి మృతి చెందడమే కాకుండా ఎన్నో కుటుంబాలు రోడ్డున పతున్నాయన్నారు. గ్రామంలో గాంధీ జయంతి సందర్భంగా మద్యపాన నిషేధంపై తీర్మానం చేశామని, మద్యం అమ్మకాలు జరుగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు, యువజన సంఘాల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఆత్మకూర్ (ఎస్) : మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ వసతిగృహంలో 2003-04సంవత్సరంలో పదోతరగతి పూర్తిచేసుకున్న విద్యార్థులు బుధవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని మండల పరిధిలోని నెమ్మికల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వసతిగృహంలో కలిసి ఉన్న అనుభవాలను నెమరువేసుకున్నారు. కార్యక్రమంలో ముల్కలపల్లి మధు, వెంపటి మైసూర్, ములకలపల్లి నాగార్జున్, చెరుకుపల్లి కిరణ్, యల్లయ్య, వెంపటి సైదులు, భిక్షం, సుమన్, మధు, సైదులు, రాజేందర్, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై సమీక్ష



మాట్లాడుతున్న ఆర్డీఓ వేణుమాదవ్

నూతనకల్ : మండలంలో వానాకాలం సీజన్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆర్డీఓ వేణుమాధవ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో స్థానిక అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. అనంతరం ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిశీలించారు. సమావేశంలో తహసీల్దార్ శ్రీనివాసరావు, డిప్యూటీ తహసీల్దార్ వంశీరాజ్, ఆర్ఐలు ప్రసాద్, హసన్ పాల్గొన్నారు.

కాన్షీరామ్‌కు ఘన నివాళి

తుంగతుర్తి : మండల కేంద్రంలో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో కాన్షీరామ్ వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా యువజన నాయకులు కాన్షీరామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు కొండగడ్పుల నవీన్, ప్రశాంత్, మల్లేపాక రవీందర్, రవి, నరేష్, వెంకన్న, శ్రీను, సాయికిరణ్, శ్రీకాంత్, అశోక్, మహేష్, వెంకటేష్, సాయితేజ, కౌశిక్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

శ్రీసరస్వతీ దేవి అలంకరణలో దుర్గామాత

భానుపురి (సూర్యాపేట) : పట్టణంలో దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. బుధవారం పట్టణంలోని శాంతినగర్ 6వవార్డ్ కౌన్సిలర్ లింగానాయక్, 36వవార్డు కాంగ్రెస్ ఇన్‌చార్జ్ షేక్ ఫారూఖ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలను ప్రారంభించారు.

మద్దిరాల : మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో దుర్గాదేవి శరన్నవరాత్రి వేడుకలు బుధవారం 7వరోజుకు చేరుకున్నాయి. ఈ వేడుకల్లో భాగంగా అమ్మవారు శ్రీసరస్వతీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా మండలంలోని కుక్కడం గ్రామంలో సరస్వతీ దేవి రూపంలో ఉన్న దుర్గామాత వద్ద పలువురు చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల భక్తులు, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి (తుంగతుర్తి) : దేవిశరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా దుర్గామాత మహాచండీ దేవిగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా మండపంలోని విగ్రహం వద్ద మహిళలు పూజలు నిర్వహించారు.



అర్వపల్లిలో దుర్గామాత విగ్రహం వద్ద కుంకుమార్చన చేస్తున్న మహిళలు

దుర్గామాత మండపం వద్ద అన్నదానం

నాగారం : దేవిశరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మండల పరిధిలోని మాచిరెడ్డిపల్లిలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపం వద్ద బుధవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పసుపులేటి ప్రేమలతవెంకట్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. అన్ని దానాల్లోకెల్లా అన్నదానం గొప్పదానమన్నారు. ప్రతిఒక్కరూ భక్తి భావం కలిగి ఉండాలన్నారు. అనంతరం దుర్గామాత విగ్రహం వద్ద పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా సుమారు 800మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.



భానుపురి (సూర్యాపేట) : అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న పటేల్ రమేష్‌రెడ్డి

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని దూపహాడ్ గ్రామంలో దుర్గా పరమేశ్వర సీతారామ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహం వద్ద నిర్వాహకులు బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎస్ఐ రవీందర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తూముల సురేష్‌రావు ప్రారంభించారు. కార్యక్రమంలో పిన్నాని కోటేశ్వరరావు, దొంగరి సైదులు, అడ్డి కేశవులు, పిన్నాని జనార్దన్, సందీప్, వీరయ్య పాల్గొన్నారు.



మద్దిరాల : కుక్కడంలో దుర్గామాత వద్ద చిన్నారులకు అక్షరాభ్యాసం చేస్తున్న భక్తులు



తిరుమలగిరిలో పూజలు చేస్తున్న భక్తులు



పెన్‌పహాడ్ : దూపహాడ్‌లో పూజలు చేస్తున్న ఎస్ఐ రవీందర్, కాంగ్రెస్ అధ్యక్షుడు సురేష్‌రావు

13న విశ్వబ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక

సూర్యాపేట : పట్టణంలోని కిరాణం ఫ్యాన్సీ, మర్చంట్ అసోసియేషన్ భవనంలో ఈనెల 13న విశ్వబ్రాహ్మణ ఉచిత వివాహ పరిచయ వేదిక నిర్వహిస్తున్నట్లు విశ్వకర్మ ఫౌండేషన్ సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అడ్లూరి రవీంద్రాచారి తెలిపారు. బుధవారం పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 15నుంచి 20సంవత్సరాలలో రెండు తెలుగు రాష్ట్రాలలో అనేక కుటుంబ వివాహ సమాచారాలను సేకరించి మన బంధువులకు అందించినట్లు తెలిపారు. పైసా ఖర్చు లేకుండా బీజీగా ఉండే వారికి, తిరగలేని పేదవారి కోసం ఉచితంగా ఈనెల 13న ఉదయం 10.30గంటల నుంచి సాయంత్రం 4.30గంటల వరకు వివాహ పరిచయ వేదికను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో ముదిమాణిక్యం వీరబ్రహ్మచారి, నాగవెల్లి బ్రహ్మయ్య, బాణాల శ్రీనివాస్, వీరండి సీతారామాచారి, సలేంద్రాచారి, పరిపూర్ణాచారి, రంగు దిలీప్‌కుమార్, తంగెళ్లపల్లి మధుకర్, కొండగూడూరి లక్ష్మణాచారి తదితరులు ఉన్నారు.

బతుకమ్మ వేడుకకు బందోబస్తు

సూర్యాపేటటౌన్ : పట్టణంలో గురువారం నిర్వహించే సద్దుల బతుకమ్మ వేడుకలకు భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు డీఎస్పీ రవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బందోబస్తులో ముగ్గురు సీఐలు, 10మంది ఎస్ఐలు, 100మంది పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. డీజే సౌండ్ సిస్టం ఉపయోగిస్తే కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సదస్సు

అర్వపల్లి : మండల పరిధిలోని సూర్యానాయక్‌తండాలో తెలంగాణ సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నిర్మూలన, గంజాయి నియంత్రణ, పారిశుద్ధ్యం, ఆరోగ్యం, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలపై కళాకారులు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాకారుల జిల్లా టీం లీడర్ ఈర్ల సైదులు మాట్లాడారు. ప్రతిఒక్కరూ మత్తుపానియాలకు దూరంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో సాంస్కృతిక సారథి జిల్లా అధ్యక్షుడు వెన్నెల నాగరాజు, ఎం.శంకర్, గడ్డం ఉదయ్, పి.శ్రీకాంత్, మేడిపల్లి వేణు, పి.ఉపేందర్, మంజుల, రాధ పాల్గొన్నారు.

మద్దిరాల : మండల పరిధిలోని కుక్కడం గ్రామంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం శాంతిభద్రతలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో తుంగతుర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌నాయక్ పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ప్రతిఒక్కరూ కలిసిమెలిసి ఉండాలన్నారు. గ్రామాల్లో గంజాయి విక్రయాలు చేస్తే 100కు డయల్ చేసి సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ ఎం.వీరన్న, సిబ్బంది పాల్గొన్నారు.

'దసరా' శాంతియుతంగా జరుపుకోవాలి

నాగారం : దసరా ఉత్సవాలను ప్రజలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని నాగారం సర్కిల్ సీఐ రఘువీర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో అఖిలపక్ష పార్టీలతో నిర్వహించిన శాంతి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నేడు నిర్వహించుకునే సద్దుల బతుకమ్మ, ఈనెల 12న దసరా పండగలను ప్రజలు ఎలాంటి ఘర్షణలకు పాల్పడకుండా శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఎస్ఐ ఎం.ఐలయ్య, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, ఆయా పార్టీ నాయకులు, యువజన సంఘాల నాయకులు, పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ కార్యవర్గం ప్రమాణస్వీకారం



ప్రమాణస్వీకారం చేస్తున్న సభ్యులు

సూర్యాపేటటౌన్ : నూతనంగా ఎన్నికైన పట్టణ ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ కార్యవర్గం ప్రమాణస్వీకారాన్ని బుధవారం జిల్లా కేంద్రంలోని జీవివి గార్డెన్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడిగా కొక్కుల శేఖర్, ప్రధాన కార్యదర్శిగా కూకుంట్ల శంకర్, కోశాధికారిగా రాపర్తి మహేష్‌గౌడ్‌లతో పాటు కార్యవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని సన్మానించారు. కార్యక్రమంలో సంఘం మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాపర్తి శ్రీనివాస్‌గౌడ్, ఫొటోగ్రాఫర్లు కాశిరత్నం, రవీందర్, చంద్రశేఖర్, శ్రీమన్నారాయణ, మల్లిఖార్జున్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో బతుకమ్మ సంబరాలు



బతుకమ్మలకు పూజలు చేస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



కలెక్టరేట్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళా అధికారులు



బతుకమ్మలతో వస్తున్న కలెక్టర్ సతీమణి, అదనపు కలెక్టర్ లత, ఇతర అధికారులు